అపోహలొద్దు

సమన్వయంతో ముందుకు వెళ్లండి

- కూటమి పార్టీలు మరో పదేళ్లు.. కలిసి ముందుకు..
- ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవలకు పార్టీల పెద్దలు కర్తవ్యబోధ


చేతులు కలిపిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ ఇన్‌చార్జ్ వలవల తదితరులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జిలు ఇద్దరూ సమన్వయంతో కలిసి ముందుకు వెళ్లాలని ఇరు పార్టీల అగ్ర నాయకులు కర్తవ్యబోధ చేశారు. ఇరువురు నేతలతో చేతులు కలిపించి ఎలాంటి అపోహలు లేకుండా సాగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంతో ఇరువురు నేతల మధ్య కొన్నాళ్లు నెలకొన్న మనస్పర్థలకు తెరపడినట్లే!

నియోజకవర్గంలో ఇరువురు నేతల మధ్య కొన్నాళ్లుగా అపోహలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్.. 'ఉప ఎన్నికల కోసం.. తాను చనిపోవాలని కొందరు కోరుకుంటున్నట్టు' చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. 'ఎమ్మెల్యేగా ప్రజలు నన్ను గెలిపించి తీర్పు ఇచ్చారు. కాని, పాలనలో కొందరి జోక్యం ఉంటోంది. అధికారులను బెదిరిస్తున్నార'ంటూ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జ్‌ను ఉద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. మరోవైపు టీడీపీ ఎస్సీ సెల్‌లోని ఓ కార్యకర్త 'తాడేపల్లిగూడెం మరో పిఠాపురం కాకుండా చూసుకోవాలి' అంటూ తెలుగుదేశం పార్టీ సభలో చేసిన వ్యాఖ్యలు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లాయి. ఈ వ్యాఖ్యలు చేసిన వ్యక్తి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో అతనికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.12 లక్షలు మంజూరయ్యేలా బాబ్జి ప్రయత్నించారు. అతనిని తీసుకుని సీఎం చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. బొలిశెట్టి, బాబ్జిల మధ్య అంతరానికి ఇది మరో కారణం.

మరోవైపు కూటమిలో కొందరు నాయకులు ఇరువురి నేతల వద్దకు వెళుతున్నారు. తెలుగుదేశం ఇన్‌చార్జ్ కార్యాలయంలో జరిగిన అంతర్గత సంభాషణలను ఎమ్మెల్యే కార్యాలయానికి చేరవేస్తున్నారు. అలాగే ఎమ్మెల్యే కార్యాలయంలో వ్యక్తిగతంగా చర్చించుకునే విషయాలను తెలుగుదేశం కార్యాలయం వద్ద ప్రస్తావిస్తున్నారు. తమ స్వప్రయోజనాల కోసం ఎక్కడ తాళం అక్కడ వేస్తున్నారు. ఇటువంటి నాయకులతోనూ రెండు పార్టీల మధ్య, ఈ ఇరువురి నేతల మధ్య భేదాభిప్రాయాలు పెరగడానికి కారణమవుతోందంటూ కూటమి శ్రేణుల్లో చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బొలిశెట్టి బుధవారం చేసిన వ్యాఖ్యలతో ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు వున్నట్టు బహిర్గతమైంది. ఈ విషయాన్ని గ్రహించిన ఇరు పార్టీల అధిష్ఠానాలు వీరిద్దరిని గురువారం విజయవాడ పిలిపించి మాట్లాడారు.

చేతులు కలిపారిలా..

తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ నాయకులు కె.కె.సత్యనారాయణ, చక్రవర్తిలతో కూడిన సమన్వయ కమిటీ బొలిశెట్టి, బాబ్జిలతో భేటీ అయ్యింది. ఇరువురి వాదనలు విన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి చేసిన వ్యాఖ్యలపై ఇరువురి నుంచి వివరాలు సేకరించారు. నాయకులు ప్రస్తావించిన విషయాల్లో కొన్నింటిని విస్మరించాలని కమిటీ నేతలు ఇద్దరికి దిశా నిర్దేశం చేశారు. అందుకు వీరు అంగీకరించారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఇద్దరు కలిసిమెలిసి వెళ్లాలని సూచించారు. కలిసి ముందుకు వెళ్లేందుకు వీరిద్దరూ అంగీకరించడంతో కో-ఆర్డినేషన్ కమిటీ నేతలు సంతృప్తి చెందారు. భేటీలో బొలిశెట్టి, బాబ్జిలతో చేతులు కలిపించారు.

చలో.. అమరావతి


ముస్తాబైన ప్రధాని మోదీ పాల్గొనే సభా వేదిక

రాజధాని పునఃనిర్మాణానికి నేడు శంకుస్థాపన

రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభానికి అనువుగా నేడు జరుగుతున్న కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ నుంచి పెద్ద ఎత్తున తరలి వెళుతున్నారు. ఇప్పటికే అధికారులు కలుగజేసుకుని ఏ ప్రాంతం నుంచి ఏ వాహనం, ఏ సమయంలో బయలు దేరుతుందో, తిరిగి, ఏ సమయానికి స్వస్థలాలకు చేరుకుంటామో అనే సమాచారాన్ని ఎక్కడికక్కడ అందించారు. లోపాలు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో అధికారులు పూర్తిగా అప్రమత్తమయ్యారు.

- ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు
- భారీ సంఖ్యలో వాహనాలు వేలాదిగా తరలి వెళ్లనున్న ప్రజలు
- అందుబాటులో మంచినీరు, మజ్జిగ.. దారి మధ్యలోనే భోజనాలు
- అధికారుల పర్యవేక్షణ.. పక్కాగా ఏర్పాట్లు

(భీమవరం/ఏలూరు-ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతి నిర్మాణానికి అనువుగా కోట్ల రూపాయల విలువైన పనులకు నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ మహాఘట్టానికి స్వయంగా హాజరవ్వడానికి వీలుగా ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలి వెళుతున్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా అమరావతి బాట పట్టేందుకే అందరూ ఉత్సాహం చూపిస్తున్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీడు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున అమరావతికి తరలి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. స్థానికులతోపాటు పార్టీల్లో వివిధ హోదాల్లో ఉన్న వారంతా శుక్రవారం అమరావతి తరలి వెళ్లేలా సన్నద్ధమయ్యారు. ఏలూరు, దెందులూరు, చింతలపూడి, ఉంగుటూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నర్సాపురం, ఉండి, ఆచంట నియోజకవర్గాల నుంచి ఊహించిన దానికంటే అధికంగానే రాజధానికి వెళ్లేందుకు అత్యధికులు ఉత్సాహం ప్రదర్శించారు. దీంతో వాహనాలు సరిపోతాయా లేదా అనే సందేహాలు కొందరు లేవనెత్తారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు తన నియోజకవర్గ నుంచి పెద్దఎత్తున ఏర్పాట్లుచేశారు. అమరావతికి వెళ్లే వారి సౌకర్యార్థం ప్రభుత్వం తగు ఆదేశాలు జారీచేసింది. స్థానికంగా ప్రజలతో బయలుదేరే ప్రతీ వాహనంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేలా, అవసరమైతే సాయపడేలా ఓ అధికారిని అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతీ వాహనంలోను మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేలా చూసుకున్నారు. జాతీయ రహదారి పొడవునా వీలైనంత మేర మజ్జిగ, మంచినీరు దూరప్రాంతాల నుంచి వస్తున్న వారికి నేరుగా అందించేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత వాహనాలు గమ్య స్థానాలకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

500 బస్సులు కేటాయింపు

విద్యార్థులకు సెలవులు కావడంతో జనాన్ని తరలించడానికి పాఠశాలల బస్సులను వినియోగిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి 500 బస్సులు కేటాయించారు. ఇందులో 250 ఎన్టీఆర్

(మిగతా 6వ పేజీలో)

ఎలా వెళ్లాలి..?

కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఉదయం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు - 7లో

అమరావతి సభకు ప్రజా స్పందన : నిమ్మల


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు శుక్రవారం అమరావతి వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది హాజరు కానున్నారని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లులోని ఆయన కార్యాలయంలో గురువారం కూటమి ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రం దిశ, దశ మార్చే చారిత్రక సభకు హాజరయ్యేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రధాని సభకు తరలి వెళ్ళేందుకు ప్రజా స్పందన అద్భుతంగా ఉందన్నారు. పాలకొల్లు నుంచి ప్రధాని సభకు 25 బస్సులు, 120 కార్లతో ఐదు వేల మందికిపైగా తరలి వెళుతున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జీవీ, ఎం.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రజెండాల రెపరెపలు

జిల్లావ్యాప్తంగా గురువారం వామపక్షాలు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎర్ర జెండాలను ఎగురువేసి శ్రామిక, కార్మికుల హక్కుల కోసం నినదించారు.

టెన్త్ టాపర్లకు ప్రతిభా పురస్కారాలు



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని 48 మండలాల జడ్పీ హైస్కూళ్లలో ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులను గురువారం ఏలూరు జిల్లా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో జడ్పీ ప్రతిభా పురస్కారాలతో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు సత్కరించారు. -7లో

సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ఆరు నెలల పొడిగింపు -7లో


అత్తిలిలో పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి

93.28 శాతం పింఛన్ల పంపిణీ

భీమవరం టౌన్/అత్తిలి, మే 1(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గురువారం సాయంత్రానికి 93.28 శాతం నమోదైనట్టు జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. 2,25,231 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి వుండగా 2,10,790 మందికి అందించారు. 14,441 మందికి అందించాల్సి ఉంది. కలెక్టర్ నాగరాణి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అత్తిలిలో పెన్షన్లు పంపిణీ చేసి, బల్లిపాడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు.

రైతుల ఆశలపై పోటు

కొన్నేళ్లుగా తొమ్మిది వేల ఎకరాల్లో సాగుకు విరామం

- దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళనను పట్టించుకోని గత ప్రభుత్వం
- టీడీపీ హయాంలో పనులు మొదలు పెట్టాలనుకున్నా ఐదేళ్లుగా నిర్లక్ష్యం..
- కూటమి ప్రభుత్వంలోనైనా రెగ్యులేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి

మొగల్తూరు, మే 1(ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం దర్భరేవు నుంచి మొగల్తూరు మండలం గొంతేరు డ్రెయిన్‌లో కలిసే దర్భరేవు డ్రెయిన్ చెత్త, తూడు, ఇసుకతో పూడుకుపోయి నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. ఈ డ్రెయిన్ పదేళ్లుగా ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు గ్రామాల రైతులు సాగుకు దూరమయ్యారు. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి పలుమార్లు వినతులు రావడంతో ఈ డ్రెయిన్ ప్రక్షాళన చేసి, మొగల్తూరు పంచాయతీ పరిధి కొత్తకాయలతిప్ప వద్ద రెగ్యులేటర్ నిర్మాణానికి నాటి ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులు టెండర్ దశకు వచ్చే సమయంలో 2019లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ముందుకు సాగలేదు. అనంతరం ఏర్పడిన వైసీపీ పాలనలో రైతుల నుంచి ఎన్ని వినతులు వచ్చినా ఈ డ్రెయిన్ ప్రక్షాళనకు కనీస చర్యలు చేపట్టలేదు. ఫలితంగా దర్భరేవు, చామకూరివారిపాలెం, కొడప, పసలదీవి, రామన్నపాలెం, కొత్తకాయలతిప్ప, మోడి గ్రామాల పరిధిలో రైతులు ముంపు ప్రభావంతో నష్టాలు చవిచూడలేక వరి సాగుకు విరామం ప్రకటించారు.

15 కిలోమీటర్లు దూరం ప్రవహించి ఉప్పుటేరులో కలిసే ఈ డ్రెయిన్ ప్రక్షాళనకు నోచుకోకపోవడంతో చేలు బీడు వారుతుండటంతో సాధ్యమైన ప్రదేశాల్లో ఆక్వా సాగుకు లీజుకు ఇచ్చేస్తున్నారు. సాగు చేసిన ఆక్వా చేలు ముంపు ప్రభావంతో నష్టాల బాటలో ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్ ఆయకట్టు పరిధిలోని పచ్చని వరి చేలు రొయ్య, చేపల చెరువులుగా మారిపోతున్నాయి. ఈ డ్రెయిన్‌ను అనుకుని తొమ్మిది వేల ఎకరాల వరి, ఆక్వా సాగుపై వందలాది కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. ధాన్యాగారంగా పేరొందిన రామన్నపాలెం పంచాయతీ అడవిపల్ర, కొత్తకాయలతిప్ప, మోడి గ్రామాల్లో డ్రెయిన్ పోటు ప్రభావంతో తరచూ చేలు ముంపునకు గురవడంతో నష్టాలు చవి చూడలేక దశాబ్ద కాలంగా సాగును విరమించారు. ఈ డ్రెయిన్‌ను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి కొత్తకాయలతిప్ప వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తే సముద్ర ఆటుపోటుల ప్రభావం నుంచి గట్టెక్కుతామని రైతులు వేడుకొంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజా ప్రతినిధులు మారుతున్నా డ్రెయిన్ ప్రక్షాళనకు పరిష్కారం లభించడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగుకు దూరంగా చేలు ఉండటంతో పలు గ్రామాల్లో వందలాది కుటుంబాలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ పోటు ప్రభావంతో సాగుకు దూరంగా ఉన్న రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రెయిన్ ప్రక్షాళన చేసి రెగ్యులేటర్ నిర్మించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


పూడుకుపోతున్న దర్భరేవు డ్రెయిన్

• సాగుతో నష్టపోతున్నాం



దర్భరేవు డ్రెయిన్ పోటు ప్రభావంతో సాగు చేసిన ప్రతీసారి తీవ్రంగా నష్టపోతున్నాం. చేలల్లో ముంపునీటి ప్రభావంతో సాగు చేసిన ప్రతీ సారి ముంపునీటిని ఇంజన్ల సహాయంతో బయటకు తోడుకోవడం వ్యయప్రయాలకు లోనవుతున్నాం. తొమ్మిది వేల ఎకరాలు సాగుకు దూరమవుతున్న తమ సమస్యకు అత్యవసర ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం ఈ వేసవిలోనే డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని కోరుతున్నాం.

యాతం పాండురంగారావు, రైతు, పులపర్తివారితోట

• రెగ్యులేటర్ నిర్మించాలి



దర్భరేవు డ్రెయిన్ ఆయకట్టు పరిధిలో గల తాము సాగు చేసి తీవ్రంగా నష్టపోవడంతో సాగు విరామం చేశాం. పదేళ్లుగా సమస్యపై రైతులు పోరాడుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. శివారు ప్రాంత రైతుల సాగు అవసరాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని డ్రెయిన్ ప్రక్షాళనతో పాటు కొత్తకాయలతిప్ప వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం అవుతోంది.

\- లక్కు బాలాజీ, రైతు, కొత్తకాయలతిప్ప

7 రైతులకు మేలైన విత్తనాలు అందించండి

నరసాపురం మునిసిపాలిటీలో ఏం జరుగుతోంది ?

బాబోయ్.. ఇక్కడ పనిచేయలేం

- బదిలీల కోసం ఇక్కడి ఉద్యోగుల ప్రయత్నాలు
- నెల రోజుల క్రితం పెన్‌డౌన్‌కు యత్నం

నరసాపురం, మే 1(ఆంధ్రజ్యోతి): నరసాపురం మునిసిపాలిటీ పేరు చెబితే చాలు కొందరు ఉద్యోగులు పారిపోతున్నారు. బాబోయ్ ఇక్కడ పనిచేయలేమని వాపోతున్నారు. బదిలీల ఉత్తర్వులను ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇలా ఒకరు, ఇద్దరు కాదు.. దాదాపు అన్ని శాఖల్లోనే ఇదే పరిస్థితి. ఇప్పటికే కొందరు అధికారులు పక్క నియోజకవర్గాల ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలను తెచ్చి దగ్గర పెట్టుకున్నారు. దీంతో ఉత్తర్వులు రాగానే పురపాలక సంఘం ఖాళీ అవుతుందన్న వాదన ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తోంది. నెల రోజుల క్రితం ఉద్యోగులంతా ముకుమ్మడిగా సెలవులు పెట్టాలని లేదా పెన్‌డౌన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఓ ప్రజా ప్రతినిధి (మిగతా 6వ పేజీలో)

ఆ అధికారి తీరుపై..

ప్రతి కౌన్సిల్ సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఆ అధికారి తీరును ఎండగడుతూ వస్తున్నారు. అయినప్పటికీ ఆయన గారికి చీమ కుట్టినట్లు యినా ఉండటం లేదు. పైఅధికారులకు కూడా ఈయనపై ఎన్నో ఫిర్యాదులు వెళ్లాయి. కాని, ఓ ప్రజా ప్రతినిధి అండదండల వల్ల ఈయనను ఏమి చేయలేకపోతున్నారన్న వాదనలు ఉద్యోగ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఆయన మొదటి నుంచి తన వద్ద పనిచేసే ఉద్యోగులంటే చాలా చిన్నచూపు ఉందనే ఆరోపణలు ఉన్నాయి. వారితో వ్యవహరించే తీరుపైన అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. తనకు నచ్చని వారిపై కక్ష సాధిస్తారని, తరచూ వారిని వేధిస్తుంటారని చెబుతున్నారు. అలాగే ఆ అధికారి అవినీతి పర్వంపైన పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎదుటి వారి అవసరాలకు తగ్గట్టు డబ్బులు డిమాండ్ చేస్తారని పేరు తెచ్చుకున్నారు. ఆయన పనిచేసిన ప్రతిచోటా వివాదాస్పదంగానే వ్యవహరిస్తారని విమర్శలు ఉన్నాయి. నరసాపురం పురపాలక సంఘం 50 ఏళ్ల చరిత్రలో ఇలాంటి అధికారిని చూడలేదని ప్రజలు, కౌన్సిలర్లు, ఉద్యోగులు చెప్పడం కొసమెరుపు. అయినప్పటికీ ఓ ప్రజా ప్రతినిధి మద్దతు కారణంగా ఆయనను ఇక్కడి నుంచి ఎవరూ కదిలించలేని పరిస్థితి అని సమాచారం.



జట్టు కార్మికులకు టవల్స్, పండ్లు పంపిణీ

పాలకొల్లుటౌన్, మే1(ఆంధ్రజ్యోతి): మేడే సందర్భంగా ఏఎంసీ ఆవరణలోని జట్టు కార్మికులకు కాపు క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్ ఆధ్వర్యంలో పండ్లు, టవల్స్‌ను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జక్కంపూడి మదన్, వేరుకొండ దుర్గాప్రసాద్, కటారి నాగు, గంధం ఏసుపాదం, కె.నరసింహారావు కొండ్రెడ్డి సూరిబాబు, రాంబాబు, చుండూరి రంగయ్య నాయుడు, గుండుమోగుల వీరాస్వామి పాల్గొన్నారు.



భీమవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు



భగ్గేశ్వరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర

రైతులకు తోడుగా ప్రభుత్వం : మంత్రి నిమ్మల

పాలకొల్లు/పాలకొల్లు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం తోడుగా ఉంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని భగ్గేశ్వరం, పూలపల్లి గ్రామాల్లో రూ.1.62 కోట్లతో చేపట్టనున్న గ్రావెల్‌రోడ్లు, డ్రెయిన్ల తవ్వకం, కల్వర్టులు నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకు స్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రూ.42 కోట్లతో 99 అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ ౘైర్మన్ కోడి విజయభాస్కర్, యర్రంశెట్టి పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్.. రాబందుల ముఠాకు అధ్యక్షుడు..

వైఎస్ జగన్ వైసీపీకి అధ్యక్షుడు కాదని రాష్ట్ర రాబందుల ముఠాకు అధ్యక్షుడని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఎవరు ఎక్కడ చనిపోతారో చూసుకుని అక్కడ రాబంధులా వాలి రాజకీయం చేయడమే ఆయన నైజమని భగ్గేశ్వరం గ్రామంలో విమర్శించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి

రాజకీయ లబ్ధికోసమే జగన్ ఆరాటం : ఆరిమిల్లి

తణుకు మే 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఏ సంఘటన జరిగినా తద్వారా రాజకీయ లబ్ధిపొందాలని జగన్ ఆరాట పడుతున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నాయకులు ఇప్పటికైనా శవరాజకీయాలు మానుకోవాలన్నారు. సింహాచలంలో ప్రకృతి వైపరీత్యం వల్ల దేవాలయ ప్రాంగణంలో జరిగిన ఘటనను సైతం రాజకీయం కోసం వాడుకుని లబ్ధిపొందాలని చూడడం, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై బురదజల్లే విధంగా ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు, జగన్‌కు లేదని విమర్శించారు. సింహాచలంలో ఘటన జరిగిన వెంటనే అధికార యంత్రాంగం, మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారని చెప్పారు. సింహ్చాచలంలో మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

లో-ఓల్టేజ్ సమస్య పరిష్కరిస్తాం : విప్ నాయకర్



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన విప్ నాయకర్

నరసాపురం టౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో లో-ఓల్టేజ్ సమస్యను లేకుండా కొత్త సబ్‌స్టేషన్లతో పాటు పట్టణ, మండలాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్టు విప్ నాయకర్ అన్నారు. గురువారం ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో పట్టణంలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో వేములదీవిలో కొత్త సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ ౘైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, ట్రాన్స్‌కో ఎస్ఈ రఘునాథబాబు, డీఈ మధుకుమార్, ఏడీఈ ఓంకాం, ఏఈ ప్రభాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



గురువులను సత్కరించిన 1996-97 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

తాడేపల్లిగూడెం రూరల్, మే1 (ఆంధ్రజ్యోతి): వారంతా 1996-97 సంవత్సరంలో పదో తరగతిని వానపల్లిగూడెంలోని గుడ్‌షెపర్డ్ స్కూల్‌లో చదివి ప్రస్తుతం వేర్వేరు వృత్తుల్లో స్థిరపడ్డారు. అంతా కలిసి స్థానిక ఫంక్షన్ హాలులో గురువారం ఆత్మీయంగా కలిసి కష్టసుఖాలు తెలుసుకుని అప్పటి గురువులను సత్కరించుకున్నారు. చిన్ననాటి స్మృతులను నెమరువేసుకోవడంతోపాటు తమతోపాటు కలిసి చదువుకున్న తోటి స్నేహితుడు శ్రీనివాస్‌కు రూ.25వేల ఆర్థిక చేయూత అందించారు. అప్పటి హెచ్ఎం బొండాడ ఐజాక్, ఉపాధ్యాయులు రాజేంద్ర, విజయ మణమ్మ, మాకా ప్రసాదరావు, జంధ్యాల సత్యనారాయణ, తోట శ్రీనివాసరావులను సత్కరించారు. దోనేపూడి సురేష్, కలబత్తుల మల్లేశ్వరరావు, పోలిశెట్టి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

చలో అమరావతి

(5వ పేజీ తరువాయి)

జిల్లాకు, 100 కృష్ణా జిల్లాకు తరలించారు. మన జిల్లా నుంచి 150 బస్సుల్లో ప్రజలు తరలి వెళ్లే లా ఏర్పాటు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి వెళ్లే జనం కోసం రెండు మార్గాలను ఎంపిక చేశారు. ఒకటి జాతీయ రహదారి మీదుగా గన్నవరం నుంచి అమరావతి చేరుకుంటాయి. తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట నియోజకవర్గాల నుంచి ప్రజలు గన్నవరం మీదుగా వెళ్లేలా ఏర్పాటు చేశారు. పాలకొల్లు, నర్సాపురం, భీమవరం, ఉండి నియోజకవర్గాల ప్రజలు ఉయ్యూరు మీదుగా అమరావతి చేరుకుంటారు. జిల్లా నుంచి బస్సుల్లో వెళ్లే జనాల కోసం గన్నవరం, ఉయ్యూరులో మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. రెండుచోట్ల ఇద్దరు ఇన్‌ఛార్జ్‌లను నియమించారు.

బాబోయ్.. ఇక్కడ పనిచేయలేం

(5వ పేజీ తరువాయి)

హామీతో విరమించుకున్నారు. కానీ పురపాలకంలో పరిస్థితులు మారలేదు. దీంతో వెళ్లిపోవడమే బెస్ట్ అని భావించారు. ఇంత దారుణమైన పరిస్థితి కారణం పురపాలక సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారే. ఈయన గారి పనితీరు వల్ల ఎనిమిది నెలలుగా పురపాలక సంఘంలో అన్ని విభాగాలు పడకేశాయి. అభివృద్ధి ఊసేలేదు. అయితే అవినీతి మాత్రం తారస్థాయికి చేరింది. ఈ పరిస్థితులను వేగలేక వెళ్లిపోవడమే మంచిదన్న భావనకు ఉద్యోగ వర్గాలు వచ్చేశాయి. ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు బదిలీపై వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలోని వేర్వేరు పురపాలక సంఘాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వీరిలో కొందరికి ఆయా నియోజకవర్గాల్లో సిఫారసు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే ఇంజనీరింగ్ విభాగానికి వచ్చేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. గతంలో ఇక్కడ ఏసీబీ, విజిలెన్స్ దాడులు జరిగాయి. ప్రస్తుతం మళ్లీ విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వీరు ముగ్గురూ వెళితే ఎవరూ కొత్తగా వచ్చే ఛాన్స్ లేదని ఆ విభాగంలో ఉద్యోగులు బల్లగుద్ది చెబుతున్నారు. మరో రెండేళ్లలో పుష్కరాలు రానున్నాయి. ఇప్పటి వరకు ఎటువంటి అంచనాలు తయారు చేయలేదు. దీనికి కారణం కూడా ఈ అధికారే అన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇక మిగిలిన విభాగాల్లోనే ఇదే పరిస్థితి.



ఆకివీడులో ర్యాలీగా తరలివెళుతున్న సీఐటీయూ నాయకులు



పెంటపాడులో కమ్యూనిస్టు నాయకుల ర్యాలీ



ఆచంటలో మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తూ కోలాటం చేస్తున్న మహిళలు



తణుకులో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకుడు డీవీవీఎస్ వర్మ

ఘనంగా మేడే

- వాడవాడలా రెపరెపలాడిన ఎర్ర జెండాలు
- పలు సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ప్రదర్శనలు

ఆకివీడు/పాలకోడేరు/ఉండి/కాళ్ల, మే 1(ఆంధ్రజ్యోతి): ఆకివీడులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరామ్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. గురువారం కార్మికులు వాడ వాడలా ఎరుపు జెండాలు రెపరెపలాడించారు. సీఐటీయూ మండల కార్యదర్శి కె.తవిటినాయుడు, అధ్యక్షుడు పెంకి అప్పారావు, యూటీఎఫ్ మండల కార్యదర్శి ఆర్వీ నారాయణ, బొక్కా వర్మ, డోకల రవితేజ, తదితరులు ఉన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పాలకోడేరు మండలంలో మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు, స్కీమ్ వర్కర్లు అన్ని రంగాల కార్మికులతో సొసైటీ వద్ద సభ జరిగింది. తొలుత సీనియర్ కార్మికుడు వెంకట్రావు జెండా ఆవిష్కరణ చేసి సభ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఉండి మండలంలో సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు, సీపీఎం మండల కార్యదర్శి చీర్ల శేషు, ధనికొండ శ్రీను ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. స్థూపం వద్ద జెండాను ఎగురవేశారు.

- తణుకు/తణుకు రూరల్/అత్తిలి/ఇరగవరం : కార్మికుల హక్కులు కాలరాస్తే ఏ ప్రభుత్వం అయినా అధికారం నుంచి గద్దె దిగాల్సిందేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, సీపీఎం జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు హెచ్చరించారు. తణుకులోని సీపీఎం, సీపీఐ కార్యాలయాల వద్ద నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా ర్యాలీగా నరేంద్రసెంటర్ వరకు కార్మికులు డప్పులతో ఉత్సాహంగా ఊరేగింపుగా వెళ్లారు. ఆయా కార్యాలయాల వద్ద జెండాలు ఆవిష్కరించారు. ఉత్పత్తికారకులు సంపద సృష్టికర్తలైన కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీఅక్కమాంబ టెక్స్‌టైల్స్ అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ అన్నారు. తణుకు రూరల్ దువ్వ గ్రామంలో ఏఐటీయూసీ నాయకులు టి.అప్పలస్వామి, కొడమంచిలి కోటి జెండాలను ఆవిష్కరించారు. వేల్పూరు గ్రామంలో కార్మిక నాయకులు పి. దక్షిణమూర్తి ఆధ్వర్యంలో ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. అత్తిలి మండలంలో ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నుంచి మార్కెట్ మీదుగా బస్‌స్టాప్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మేడే విశిష్టతను తెలియజేశారు. ఇరగవరం మండలం ఇరగవరంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు అడ్డగర్ల అజయ్‌కుమారి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. తూర్పు విప్పర్రు గ్రామ కూడల్లో ర్యాలీ చేపట్టి కార్మిక జెండాలను ఎగురవేశారు. కాళ్ళ మండలంలో సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాయలం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు.
- తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు : తాడేపల్లిగూడెంలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, సీపీఎం, సీపీఐ, ఐఎఫ్‌టీయూ తదిరత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ఎర్రదండు కవాతు నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, కార్యదర్శి మందలపర్తి హరీశ్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. అనంతరం ఎన్‌కే గ్రౌండ్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నవాబుపాలెంలో మేడే వేడుకలు నిర్వహిం చారు. పెంటపాడు మండలం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సీపీఎం జిల్లా సెక్రటరీ సభ్యుడు చింతకాయల బాబూరావు, గేటు సెంటర్‌లో చిర్లా పుల్లారెడ్డి, ఎస్‌బీఐ బ్యాంకు వద్ద సిరపరపు రంగారావు, దూలం ప్రసాద్, పెంటపాడు గేటు సెంటర్ వద్ద సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు కళింగ లక్ష్మణరావు తదితరులు సీఐటీయూ , సీపీఎం జెండాలను ఆవిష్కరించారు.
- నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం పట్టణ, మండలంలో మేడే వేడుకలు సీపీఎం, సీపీఐ, సీఐటీయూ పార్టీలు ఘనంగా నిర్వహించాయి. అంబేడ్కర్, శివాలయం సెంటర్‌లతో పాటు పలు వార్డులు, గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేశారు. ఎర్ర జెండాలు చేతబట్టి పట్టణంలో ప్రదర్శనలు చేశారు. నెక్కంటి సుబ్బారావు, ఎం త్రిమూర్తులు, కవురు పెద్దిరాజు, పూర్ణ, టి.సత్యనారాయణ, గాడి నెహ్రూ, కొండ, జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్‌కాలనీలో సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు ఆధ్వర్యంలో కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. మొగల్తూరు మండలం మొగల్తూరులోని సాయి తాపీమేస్త్రీల సంఘం, భవన నిర్మాణ కార్మికులు సంఘ అధ్యక్షుడు చల్లా మురళీ కృష్ణ, పోతురెడ్డి ముత్యాలరావు ఆధ్వర్యంలో మొగల్తూరు లాకు వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, జట్టు కార్మికులు మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి కార్మిక పతాకాలను ఆవిష్కరించారు.
- పెనుగొండ/ఆచంట:పెనుగొండ మండలంలో సీఐటీయూ పెనుగొండ మండల కార్యదర్శి తులసి ఆధ్వర్యంలో పార్కు సెంటర్ నుంచి కామ్రేడ్ వాసంశెట్టి వీరన్న స్థూపం వరకు ప్రదర్శన నిర్వహించారు. సిద్ధాంతం గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బస్టాండ్, గ్రామపంచాయతీల మీదుగా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రాజేష్ సెంటర్‌లో జెండా ఆవిష్కరించారు. ఆచంట మండలం ఆచంటలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఆచంటలో కోలాటం ప్రదర్శన నిర్వహించారు.
- పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు పట్టణంలో సీపీఎం కార్యాలయం వద్ద నాయకుడు జవ్వాది శ్రీనివాసరావు పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా గాంధీ బొమ్మల సెంటర్‌కు చేరుకున్నారు. రైస్ మిల్లు కార్మికులు, జట్టు కార్మికులు పాల్గొన్నారు. లారీ స్టాండ్ వద్ద లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, వడ్రంగి మేస్త్రీల సంఘం, తాపీ మేస్త్రీల సంఘం, ఆర్టిస్ట్స్ అండ్ పెయింటర్స్ సంఘం, ప్రైవేటు విద్యుత్ కార్మికుల సంక్షేమ సంఘం, మోటారు వర్కర్స్ అసోసియేషన్ నాయకులు ర్యాలీలు నిర్వహించి, మే డే కార్యక్రమాలలో పాల్గొన్నారు.
- గణపవరం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను కార్మికలోకం విజయవంతం చేయా లని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. మేడే వేడుకలను గణపవరం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, సీఐటీయూ నాయకులు పెంటారావు, నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భవన నిర్మాణానికి కృషి చేస్తా : అంజిబాబు

వీరవాసరం/ భీమవరంటౌన్/భీమవరం క్రైం/భీమవరంఅర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : భవన కార్మికుల నూతన భవన నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే నిధులు అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. గురువారం వీరవాసరంలో మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భీమవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కూటమి ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 30 మంది హమాలీలు, కూలీలకు నూతన వస్త్రాలను, రగ్గులు, చీరలు అందించారు. రైల్వే సీఐ దస్తగిరి, రైల్వే టీసీ వివేక్, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు. 'కార్మికుల పని గంటల కోసం, వారి హక్కుల సాధనకు కృషి చేసిన డాక్టర్ అంబేడ్కర్‌ను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో కార్మికులతో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం సీఐటీయూ ఆధ్వర్యంలో..

కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల రద్దుకు ఐక్యంగా పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. భీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి ఉన్న హక్కులు చట్టాలు, 1991 తర్వాత చేసిన చట్టాలు రాయితీలను ప్రస్తుతం పాలిస్తున్న ప్రభుత్వాలు తొలగిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, మెడికల్ రిప్రజెంట్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎస్.శ్రీనివాస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజు మాట్లాడారు. ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు షేక్ వలి, సీతారాం ప్రసాద్ గీతాలు ఆలపించారు.

- కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలకులకు మేడే స్ఫూర్తితో బలమైన ఉద్యమాలు నిర్మించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. మునిసిపల్ వర్కర్స్‌కాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, చినరంగనిపాలెం, శ్రీనివాసా సెంటర్, తిరుమల కళాశాల తదితర ప్రాంతాల్లో ఎర్ర జెండాలను ఎగరవేశారు.



బ్రదర్ అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న గ్రామపెద్దలు

ముగిసిన సువార్త మహాసభలు

కాళ్ళ, మే 1 (ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలం ఎస్సీ బోస్ కాలనీలో మూడు రోజులపాటు నిర్వహించిన ఆధ్యాత్మిక సువార్త మహాసభలు బుధవారం రాత్రితో ముగిశాయి. మొదటిరోజు ఎంఎస్ఎన్ రాజు, గేదెల జాన్ సువార్త సభను ప్రారంభించారు. ఆఖరి రోజుగా బ్రదర్ అనిల్‌కుమార్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఆయన ప్రసంగం వినేందుకు పెద్దఎత్తున క్రైస్తవులు హాజరయ్యారు. అనంతరం బ్రదర్ అనిల్‌కుమార్‌ను గ్రామపెద్దలు, సంఘస్థులు ఘనంగా సత్కరించారు

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్యుల రాక

పెంటపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల మూడో తేదీన హైదారాబాద్ నుంచి ప్రముఖ షుగర్ స్పెషలిస్టు వస్తున్నట్టు ట్రస్టు ౘైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. షుగరు, పాదాలలో తిమ్మిర్లు, మంటలు, స్పర్శ తగ్గడం తదితర వాటిని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి రెండో రోజు ఆసుపత్రి ప్రాంగణంలోనే ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈనెల 4 వ తేదీ ఆదివారం న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

అత్తిలిలో చలివేంద్రం ప్రారంభం

అత్తిలి, మే 1 (ఆంధ్రజ్యోతి) : అత్తిలికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు పోలిశెట్టి అప్పారావు, సత్యవతి జ్ఞాపకార్థం కుమారులు చంటి, బాబ్జి, రంగారావు సహకారంతో టీడీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం నాలుగేళ్లగా చలివేంద్రం నిర్వహించడం అభినందనీయమన్నారు. అప్పారావు మనుమలు చందు, గోపి, దాసం బాబ్జి, నల్లూరి సురేష్ పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉండి, మే 1(ఆంధ్రజ్యోతి):కంటి వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు అన్నారు. గురువారం ఆరేడులో ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీరాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటి ఆసుపత్రి నిడదవోలు వైద్యురాలు అనూష, క్యాంపు నిర్వాహకులు శ్రీనివాస్ మాట్లాడారు. 120మందికి వైద్య పరీక్షలు చేసి, 20మందికి కళ్లజోళ్లు, 9 మందికి ఆపరేషన్లు అవసరమన్నారు. ఆరేడు, కలిగొట్ల సర్పంచ్‌లు కట్రెడ్డి బ్రహ్మానందం, ఎంఎస్, ఎంపీటీసీ యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత వ్యక్తికి విశ్వబ్రాహ్మణ సంఘం సాయం

పాలకొల్లు అర్బన్, మే1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన తామరపల్లి సుబ్రహ్మణ్యంకు అనారోగ్యం కారణంగా కుడి కాలు మోకాలు వరకూ తొలగించడంతో, ఎడమ కాలు ఎడమ చేయి కూడా సరిగా పనిచేయక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. తనకు సహకరించాలని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులకు విజ్ఞప్తి చేయగా స్పందించిన నాయకులు రూ.39వేలు సంఘ సభ్యుల నుంచి సేకరించి గురువారం బాధిత సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు అందజేశారు.



వల్లూరు హైస్కూలులో ఇంటర్, టెన్త్ పరీక్షల టాపర్లను అభినందిస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

టెన్త్, ఇంటర్ టాపర్లకు అభినందనలు

ఆచంట, మే1(ఆంధ్రజ్యోతి):వల్లూరు శివారు ఎంపీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి ఇటీవల విడుదలైన టెన్త్ పరీక్ష ఫలితాలలో టాపర్లను ప్రజాప్రతి నిధులు అభినందించారు. ఇంటర్ ఫలితాలకు సంబంధించి బాలికల రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించడం, పది పబ్లిక్ పరీక్షల్లో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడంపై విద్యార్థులతో గురువారం పాఠశాల వద్ద అభినందన సభ నిర్వహించారు. వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచ్ నేలపూడి బేబి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, హెచ్ఎం నరసింహారావు, ఎస్ఎంసీ ౘైర్మన్ జాన్సన్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

గరికిముక్కు సుబ్బయ్యకు సత్కారం

భీమవరంటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మమైన డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఇండియా జాతీయ సభ్యుడిగా భీమవరానికి చెందిన గరికిముక్కు సుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో సన్మాన కార్యక్రమాన్ని ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సన్మాన గ్రహీత సుబ్బయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కోసం బడ్జెట్‌లో లక్షా నలభై రెండు వేల కోట్లు రూపాయలు కేటాయించారని చెప్పారు. కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్. రాజేందర్, న్యూటన్, కె.శ్రీనివాస్, బీజే గాంధీ, జీఎం దయాకర్, గూడపాటి శాంతారావు, గంటా సుందర్‌కుమార్, ఐ.రాజేష్, డాక్టర్ కె.వీరయ్య, ఐ.వెంకటేశ్వర్లు, కోన జోసఫ్, బూసి సురేంద్రనాథ్‌బెనర్జీ, డీఎన్ఆర్ కళాశాల అధ్యాపకులు పి.అమూల్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ ఉద్యోగుల పెన్షన్లు పెంచాలి : బంగారయ్య

ఆకివీడు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎఫ్ ఉద్యోగుల పెన్షన్లు పెంచి వారి కుటుంబాలను ఆదుకోవాలని సహకార గ్రామీణ బ్యాంకుల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ దేశంలో 70 లక్షలు మంది కార్మికులు రూ.1000 నుంచి రూ. 1500లతో జీవితం గడుపుతున్నారన్నారు. పెన్షన్లు పెంచుతున్నామంటూ పదేళ్ల నుంచి కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ కార్మికులు, ప్రైవేటు ఉద్యోగులకు పెన్షన్లను రూ.7,500 చేయాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మికం

గ్రామ దేవతలకు వెండి వస్తువుల బహూకరణ

కాళ్ళ, మే 1(ఆంధ్రజ్యోతి): కాళ్లలోని మహంకాళమ్మ, వెంకమ్మ అమ్మవార్లకు వెండి వస్తువులు గ్రామానికి చెందిన వీరమల్లు రాజబాబు జ్ఞాపకార్థం కుమారులు శోభన్ కుమార్, సురేష్ కుమార్, కుటుంబ సభ్యులు గురువారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సుమారు రూ.35వేల విలువైన వెండి శఠగోపం, హారతి జాతర సందర్భంగా అందించారు. తొమ్మిది రోజులపాటు జరగనున్న జాతర సమయంలో అందుబాటులో ఉంచనున్నట్లు వారు తెలిపారు.

మావుళ్లమ్మ జాతర ప్రారంభం

పాలకొల్లు అర్బన్ : స్థానిక 6వ వార్డు షావుకారు పేటలో వున్న మావుళ్లమ్మ జాతర గురువారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం జాతర ఉత్సవాలకు అంకురార్పణ, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ వరకు అమ్మవారికి విశేష కుంకుమ పూజల జరుపుతామన్నారు. మూడో తేదీన అమ్మవారికి కుంభం పోసి, జాతర నిర్వహిస్తామన్నారు. తెల్లవార్లు జాతర నిర్వహిస్తామన్నారు. అనంతరం ఐదో తేదీన అమ్మవారికి పాన్పు వేస్తామని తెలిపారు.

ఇంటింటికి రేషన్ ప్రారంభం

ఉండి, మే1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మేనెలకు సంబంధించి ఇంటింటికి రేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. సర్వర్ సమస్యతో కొంత ఆటంకం జరిగినా తదుపరి రేషన్ అందించే ప్రక్రియ కొనసాగింది. ఉచితంగా బియ్యం, నగదుకు పంచదారను అందించారు. వేసవి దష్ట్యా ప్రతీరోజు ఏడు గంటల నుంచి సరుకులను అందించాలని ఎండీయూలకు అధికారులు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆకివీడు/తాడేపల్లిగూడెం రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 33కేవీ లైన్లకు ట్రీ కటింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. అజ్జమూరు, మాదివాడ, ఆకివీడు టౌన్, దుంపగడప, సమతానగర్, గుమ్ములూరు, ఇండస్ట్రియల్, అయి-భీమవరం, కుప్పనపూడి, తాళ్ళకోడు లైన్లకు సరఫరా ఉండదన్నారు. తాడేపల్లిగూడెంలోని యాగర్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కోసం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ కె. నరసింహమూర్తి తెలిపారు. యాగర్లపల్లి, కొబ్బరితోట, రామచంద్రరావుపేట, భాగ్యలక్ష్మీపేట, ఏలూరురోడ్డు పడాల, ముత్యాలంబపురం, ప్రాంతాల వారు సహకరించాలని కోరారు.

స్వర్ణాంధ్ర లెక్చరర్‌కు డాక్టరేట్

నరసాపురం రూరల్,మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జీవీఎస్ మూర్తికి డాక్టరేట్ లభించింది. ఒడిశా రాష్ట్రానికి చెందిన గైట్ యూనివర్సిటీ ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆయనను ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, కళాశాల ౘైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరి అభినందించారు.

మజ్జిగ చలివేంద్రం

పెంటపాడు, మే1(ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భైరాగిమఠం గోపాలస్వామి ఆంజనేయస్వామి ఆలయ ఈవో బీవీ.చంద్రశేఖర్ అన్నారు. ఆలయం ఆధ్వర్యంలో ఆలయ పడమర గోపురం సమీపంలో రహదారిపై ప్రయాణాలు సాగించే బాటసారుల కోసం ఉచిత మజ్జిగ చలివేంద్రాన్ని ఈవో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు త్రిలోచనదాస్, పూర్ణచంద్రత్రిపాఠి, సిబ్బంది బి.సూర్య, అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

8 సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిల
పదవీ కాలం ఆరు నెలల పొడిగింపు

ఏలూరు, మే 1(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ పరిధిలో 8 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు మరో ఆరు నెలలు కొనసాగనున్నారు. పర్సన్ ఇన్‌చార్జి, చైర్ పర్సన్ల(అధికార్ల)ను కొనసాగిస్తూ సహకార శాఖ కమిషనర్ బి.రాజశేఖర్ ఉత్తర్వులను జారీ చేశారు. పర్సన్ ఇన్‌చార్జుల గడువు ఏప్రిల్ నెలాఖరుతో ముగియడంతో మరో ఆరు నెలలు పొడిగిస్తూ జీవో ఇచ్చారు. పేరుపాలెం సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా నరసాపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.లక్ష్మిలత, కాళీపట్నం సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా నరసాపురం అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.జోసెఫ్ పాల్, తేతలికి తణుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కేవీ రామలక్ష్మి, చెరుకుమిల్లికి అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.సత్యనారాయణ పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారు. ఏలూరు జిల్లాలో గుణ్ణంపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా ఏలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.నర్సింహమూర్తి, సభ్యులుగా వి పవన్ చక్రవర్తి (సీనియర్ ఇన్స్‌పెక్టర్), రమేశ్ (భీమడోలు బీఎం), జీలుగుమిల్లికి సొసైటీ చైర్‌పర్సన్‌గా కైకలూరు అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్ ప్రసాదరావు, సభ్యులుగా కె.గంగరాజు (సీనియర్ ఇన్స్‌పెక్టర్), ఎస్ శివనాగలక్ష్మి (వేగవరం బీఎం), కామవరపుకోట సొసైటీకి చైర్‌పర్సన్‌గా నూజివీడు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె.అజయ్‌కుమార్, సభ్యులుగా ఆర్‌డీ నాగేంద్రబాబు (కెకోట బీఎం), వీటీహెచ్ నారాయణ(కెకోట సూపర్‌వైజర్) వ్యవహరించనున్నారు.

అవ్వకు పింఛను.. మంత్రికి దీవెన
పూలపల్లిలో మంత్రి నిమ్మల పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న నిమ్మల

పాలకొల్లు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : పూలపల్లిలో గురువారం ఉదయం మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, సచివాలయ సిబ్బందితో కలిసి వృద్ధులకు పింఛన్లు అందజేశారు. దమ్మా అప్పల నరసమ్మ అనే అవ్వ ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తూ అవ్వా బాగున్నావా? అంటూ మంత్రి పలకరించారు. వృద్ధురాలు వచ్చావా నాయనా అనగానే.. నన్ను గుర్తుపట్టావా అని మంత్రి నిమ్మల అడిగారు. బాబా నీవు రామానాయుడువే కదా గుర్తుపట్టాను.. అనగానే స్థానికులు చప్పట్లు కొట్టారు. 97 ఏళ్ల వయసులో కళ్లు నలుపుకుంటూ చూస్తూ, ఆయన మాటను గుర్తుపట్టడంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. స్థానికులు మంత్రితో మాట్లాడుతూ మీరు ఈ అవ్వకు బాగా తెలుసని, కరోనా సమయంలో సైకిల్‌పై మా వీధికి వచ్చి అందరితో పాటు అవ్వను పలకరించి బియ్యం, సరుకులు, కూరగాయలు అందించారని, అప్పటి నుంచీ బాగా గుర్తుండిపోయారని చెప్పారు. అవ్వకు పింఛన్ అందించగా నీవు చల్లగా ఉండాలంటూ మంత్రిని అవ్వ దీవించింది. మంత్రి నిమ్మల వెంట ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, కార్యదర్శి పాలా శ్రీనివాసు, నాయకులు, తదితరులు ఉన్నారు.

ఎవరైనా సొమ్ములు అడుగుతున్నారా..?
పశ్చిమ ప్రత్యేకాధికారి సూర్యకుమారి ఆరా


పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న సూర్యకుమారి

భీమవరం టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): చిన అమిరం గ్రామంలో పింఛన్ల పంపిణీలో గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రటరీ, జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతుందా, సిబ్బంది డబ్బులు అడుగుతున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బంది లేదని లబ్ధిదారులు చెప్పడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి కుటుంబ యోగక్షేమాలు, పిల్లల చదువులు గురించి ఆరా తీశారు. పింఛను సొమ్ము దుర్వినియోగం చేయకుండా కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. ఆర్‌ఐ నాగభూషణం, గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారి

చిన్న అమిరంలో అంగన్‌వాడీ సెంటర్‌ను జిల్లా ప్రత్యేకాధికారి ఎ.సూర్య కుమారి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలతో ముచ్చటించి వారి పేర్లను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటలు పాడించి సరదాగా గడిపారు. పిల్లలకు విద్యా బోధన పరిశీలించారు. పౌష్టికాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల హాజరు పట్టీ పరిశీలించి 15 మంది పిల్లలకు 9 మంది ఉండటం గమనించారు. పిల్లలందరినీ అంగన్వాడి కేంద్రానికి పంపేలా తల్లులను ప్రోత్సహించాలన్నారు. పిల్లల బరువు, ఎత్తును స్వయంగా పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాలను ఉద్దేశించి మాట్లాడుతు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తూ సొంత బిడ్డల్లా ఆదరించాలని అన్నారు. చిన్నారులను మంచిగా చూసుకోవాలని జిల్లా ప్రత్యేక అధికారి ఎ.సూర్య కుమారి అంగన్వాడి సిబ్బందిని ఆదేశించారు.

ఆక్వా చెరువు తవ్వకాలు నిలిపివేయాలి

కాళ్ళ, మే 1 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మంచినీటి చెరువుకు ఇబ్బంది కలిగించే చేపల చెరువులు చేపట్టకూడదని పోరాటం చేశామని, ప్రస్తుతం ప్రభుత్వంలో చేపల చెరువులు తవ్వించడానికి ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ఏలూరుపాడు గ్రామప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరుపాడు గ్రామంలో మంచినీటి చెరువుకు సమీపంలో తవ్వుతున్న ఆక్వా చెరువును నిలుపుదల చేయాలంటూ గ్రామస్థులు గురువారం ఆందోళన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయానికి కులమతాలు, పార్టీలకతీతంగా పెద్దలు, యువకులు, మహిళలు పెద్దఎత్తున చేరుకుని చెరువు తవ్వకంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ భూపతిరాజు వెంకటజగ్గరాజు ఇంటి వద్దకు ప్రజలంతా చేరుకుని చెరువు తవ్వకాలు నిలిపివేయాలని కోరారు. అవసరమైతే తమను ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్లాలని కోరుతూ బైఠాయించారు. చెరువు తవ్వకానికి సిద్ధమవుతున్న రైతుతో సర్పంచ్ ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజులపాటు తవ్వకం పనులు నిలిపివేయాలని వివరించారు.

చిన వెంకన్న కల్యాణానికి పద్మశాలీల పుట్టింటి సారె

ద్వారకాతిరుమల, మే1(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి, ఇంటి ఆడపడుచు పద్మావతి అమ్మవారికి పద్మశాలీల సంఘం నుంచి పుట్టింటి సారె ఇస్తామని ఉమ్మడి జిల్లా సంఘ అధ్యక్షుడు వానపల్లి నాగరాజు తెలిపారు. ఈనెల 7నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11న స్వామివారి తిరుకల్యాణమహోత్సవం రాత్రి 8 గంటలకు జరుగుతుందని, కల్యాణమూర్తులకు తమసంఘం తరఫున పట్టు వస్త్రాలను సమర్పించాల్సి ఉందన్నారు. పద్మశాలీలు ఎవరైనా ఇవ్వవచ్చని, ముందుగా 96400 68999 నెంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

బాల త్రిపుర సుందరికి 105 గ్రాముల వెండి


వెండిని బహూకరిస్తున్న దాతలు

భీమవరం టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి గురువారం దాతలు వెండి బహూకరించారు. భీమవరం మండలం గుట్లపాడుకు చెందిన వర్దినీడి నాగేశ్వరరావు 105 గ్రాముల వెండిని విరాళంగా ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అమ్మవారి వెండి పీఠానికి దాతలు ముందుకు వచ్చిన విరాళాలు అందిస్తున్నారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

రాజధానికి దారి మారింది
ప్రధాని మోదీ పర్యటనతో కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ట్రాఫిక్ ఆంక్షలు


అమరావతిలో ముస్తాబైన మోదీ సభా వేదిక

విజయవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వెలగపూడిలో అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్న సందర్భంగా పోలీస్ శాఖ ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జ్ పోలీస్ కమిషనర్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. ప్రధాని రాకను పురస్కరించుకుని నగరంలో వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో పలు స్టార్ హోటళ్ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. వీవీఐపీ, వీఐపీలు, ప్రముఖులు నోవాటెల్ నుంచి మహానాడు జంక్షన్, రమేశ్ హాస్పిటల్ జంక్షన్ బెంజి సర్కిల్ నుంచి ఎంజీరోడ్డు మీదుగా పీసీఆర్ జంక్షన్, ఫ్లైఓవర్ వినాయక టెంపుల్, సీతమ్మవారి పాదాలు అండర్ పాస్, ప్రకాశం బ్యారేజీ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

భారీ వాహనాలు, లారీల మళ్లింపు

శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు గుంటూరు నుంచి విశాఖపట్నం వైపునకు వెళ్లే భారీ, మధ్యతరహా వాహనాలు బుడంపాడు క్రాస్ నుంచి తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలి.

- విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే భారీ వాహనాలు హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా వెళ్లాలి.
- చెన్నై నుంచి విశాఖపట్నం వెళ్లే భారీ వాహనాలు త్రోవగుంట నుంచి చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, ప్రామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే భారీ వాహనాలు మేదరమెట్ల నుంచి అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, దామచర్ల, మిర్యాలగూడ, నార్కేట్‌పల్లి మీదుగా వెళ్లాలి.

బస్సులు, కార్ల మళ్లింపు

- ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలు చిన్న అవుటుపల్లి వద్ద పశ్చిమ బైపాస్ మీదుగా ముస్తాబాద వెళ్లి అక్కడ సర్వీస్ రోడ్డులోకి దిగి ఎడమ వైపు నున్న బైపాస్‌మీదుగా నున్న జంక్షన్ వరకు వచ్చి ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా కండ్రిక జంక్షన్, పైపుల రోడ్డు, వై.వి.రావు ఎస్టేట్ పాముల కాలువ వద్ద వెస్ట్ బైపాస్ సర్వీస్ మీదుగా నల్లకుంట అండర్ పాస్ బ్రిడ్జి, కృష్ణానది ఐకానిక్ మీదుగా వెలగపూడి సభా ప్రాంగణానికి మళ్లించడం జరిగింది. ఈ మార్గంలో వాహనాలను పార్కింగ్-6లో పార్క్ చేసుకోవాల్సి ఉంటుంది. సభ ముగిసిన తర్వాత కూడా ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది.
- ఏలూరు జిల్లా కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి వైపు నుంచి వచ్చే బస్సులు, వాహనాలు బందర్‌రోడ్డుపై బెంజి సర్కిల్ వరకు వచ్చి అక్కడ నుంచి స్క్రూబ్రిడ్జి, వారధి మీదుగా తాడేపల్లి, మంగళగిరి ఎస్ఆర్ఐ వరకు వెళ్లి ఎరుబాలెం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకుని వాహనాలను పార్కింగ్ -1లో ఉంచాలి.
- ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల నుంచి ఇబ్రహీంపట్నం రింగ్ మీదుగా నల్లకుంట వద్ద ఎడమవైపు తిరిగి పశ్చిమ బైపాస్ సర్వీస్ రోడ్‌లోకి వెళ్లి యూటర్న్ తీసుకుని వెస్ట్ బైపాస్ వంతెన మీదుగా కృష్ణానది ఐకానిక్ ఎక్కి వెలగపూడి సభావేదిక వద్దకు చేరుకోవాలి. వాహనాలను పార్కింగ్-6లో ఉంచాలి.
- ఎన్టీఆర్ జిల్లా అర్బన్ ఏరియా నుంచి వచ్చే వాహనాలు రూటు-3 ప్రకారం బెంజిసర్కిల్, స్క్రూబ్రిడ్జి మీదుగా తేడేపల్లి మంగళగిరి, ఎన్ఆర్ఐ, ఎరుబాలెం మీదుగా సభా ప్రాంగణానికి చేరుకుని పార్కింగ్-1లో వాహనాలు పార్క్ చేసుకోవాలి.
- విశాఖపట్నం నుంచి వచ్చే భారీ వాహనాలు పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద కార్యక్రమం ముగిసేంత వరకు నిలిపివేస్తారు. హైదరాబాద్ నుంచి వచ్చే భారీ వాహనాలను ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ వద్ద కార్యక్రమం ముగిసే వరకు నిలిపివేస్తారు.

వాహనాల దారి మళ్లింపు

ఏలూరు జిల్లాలో..

ఏలూరు క్రైం: రాజధాని అమరావతిలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో ఏలూరు జిల్లా మీదుగా విజయవాడ వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు.

- రాజమండ్రి వైపు నుంచి వచ్చే వాహనాలు దేవరపల్లి వద్ద నుంచి గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా సత్తుపల్లి, ఖమ్మం వైపు వెళ్లాలని సూచించారు.
- తణుకు, తాడేపల్లిగూడెం నుంచి వచ్చే వాహనాలను చేబ్రోలు రైల్వే గేటు వద్ద నుంచి దేవరపల్లి, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా వెళ్లాలని సూచించారు.
- వాహనాలు ఆ ప్రాంతాలు దాటి ఏలూరు దగ్గరలోకి వస్తే వంగూరు మెయిన్ బైపాస్ బ్రిడ్జి వద్ద నుంచి చింతలపూడి రోడ్డులోకి వెళ్లి చింతలపూడి మీదుగా హైదరాబాద్ వెళ్లాలి.
- చెన్నై వెళ్లే వాహనాలు హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ మీదుగా వెళ్లాలి.
- ఏలూరు జిల్లాకు సంబంధించిన వారు చెన్నై వెళ్లే భారీ వాహనాలు కైకలూరు, గుడివాడ మీదుగా వెళ్లాలని సూచించారు.
- హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఏలూరు నుంచి చింతలపూడి రోడ్డులో వెళ్లాలని లేదా జంగారెడ్డిగూడెం రోడ్డులోనైనా వెళ్లాలి.
- మల్టీయాక్సిల్ గూడ్స్ వాహనాలు జిల్లాలో జాతీయ రహదారిపై ఉన్న విశ్రాంతి ప్రదేశాల్లో నిలుపుదల చేయాలి. వారికి 2వ తేదీ రాత్రి 9 గంటల తరువాతే ముందుకు సాగడానికి అనుమతిస్తారు.


ప్రధాని పర్యటన, ట్రాఫిక్ మళ్లింపు వివరాలు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- ఉమ్మడి జిల్లాలో పది ప్రతిభావంతులు ఆరుగురికి సత్కారం
- జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు


సత్కారం పొందిన విద్యార్థులతో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, డీఈవోలు, జడ్పీ సీఈవో, తదితరులు

ఏలూరు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వ్యవస్థలో బట్టీ విధానం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విషయ అవగాహన చదువులు, మార్కుల్లో విశ్వసనీయత ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని జడ్పీ హైస్కూళ్లలో టాపర్లుగా నిలిచిన ఆరుగురు విద్యార్థులను గురువారం జడ్పీ మీటింగ్ హాల్‌లో ప్రతిభా పురస్కారాలతో సన్మానించారు. చైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని బట్టి చదివించాలని, ప్రభుత్వ పాఠశాలల నుంచి 14 శాతం మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించడం సాధారణ విషయం కాదన్నారు. జడ్పీ హైస్కూళ్లలో బోధ నేతర సిబ్బంది నియామకాల కోసం ఆయా శాఖల విభాగాల్లో 270 మంది సర్‌ప్లస్ ఉద్యోగులను గుర్తించామని, త్వరలోనే వీరందరినీ నియమించేం దుకు డిప్యూటీ సీఎం పవన్‌కు విన్నవించగా అంగీకారం తెలిపారన్నారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో భీమేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు, విజయకేతనం స్టడీ మెటీరియల్ కీలకపాత్ర పోషించాయన్నారు. ఫెయిలైన విద్యార్థుల కోసం ఈ నెల 19 వరకు తర్ఫీదునిచ్చి సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహించడం వల్లే ఫలితాలు తగ్గడానికి ఓ కారణమని పేర్కొన్నారు.

‘ప్రైవేటు’ టీచర్ల వల్లే వెనుకబాటు!

ఏలూరు జిల్లాలో టెన్త్ పరీక్షల్లో ఉత్తీర్ణత తగ్గడంపై జడ్పీ చైర్‌పర్సన్ భర్త ఘంటా ప్రసాద్ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆంగ్ల మాధ్యమంలో పరీక్షలు రాసిన విద్యార్థుల జవాబు పత్రాలను ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయించడం వల్లే ఉత్తీర్ణతా శాతం తగ్గిందన్నారు. మూల్యాంకనంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రైవేటు టీచర్లు వివక్ష చూపించారని పలువురు ఎంఈవోలు తన దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని డీఈవో వెంకట లక్ష్మమ్మకు, ఇతర అధికారులకు సూచించారు. సోషల్ స్టడీస్ సిలబస్ ఎక్కువగా ఉండడం, విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను పరీక్షలకు కేవలం మూడు నెలలు ముందు మాత్రమే పంపిణీ చేయడం వల్ల విద్యార్థులకు తగినంత సమయం లేకపోవడం ఉత్తీర్ణత తగ్గడానికి కారణాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను ఆగస్టు, సెప్టెంబరులోనే విద్యార్థులకు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

‘ఉమ్మడి జిల్లా’ టెన్త్ టాపర్లు వీరే

ఉమ్మడి జిల్లాలోని పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పీఎల్ఎస్ జడ్పీ బాలుర హైస్కూలు విద్యార్థిని కొల్లి సాన్వి(590), చినఅమిరం జడ్పీ హెచ్ఎస్ విద్యార్థి ఆముదాలపల్లి శివసాయి వెంకట రామకార్తీక్ (589) ద్వితీయ స్థానం, ఏలూరు జిల్లా టాపర్‌గా కామవరపుకోట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని చిలుకుబత్తుల సూర్య దీప్తి(586), చింతలపూడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కానూరి పూజిత(585) ద్వితీయ స్థానం, పెదపాడు మండలం వీరమ్మకుంట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కలిపిండి నీహారిక (584) తృతీయ స్థానాల్లో నిలిచినట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా టాపర్‌గా దేవరపల్లి మండలం యర్నగూడెం ఎస్వీజీఆర్ జడ్పీ హైస్కూలు విద్యార్థిని ఎం.తనుశ్రీ పోల శేషసాయి దుర్గ (582) మొదటి స్థానాల్లో నిలిచారన్నారు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ, తూర్పు గోదావరి జిల్లా డీఈవో తరఫున నల్లజర్ల ఎంఈవో-2 భగవతీదేవి, ఏలూరు డీవైఈవో రవీంద్రభారతి, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, ఎంఈవోల సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలైన విత్తనాలు అందించండి
వరి పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో కలెక్టర్


డ్రోన్‌తో పిచికారి చేసే విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

పెనుమంట్ర,మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా రైతులకు మేలైన విత్తనాలను అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మార్టేరు ప్రాంతీయ వరి పరిశోధనా స్థానంలో గోదావరి మండలం పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో గురువారం కలెక్టర్ నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరదలు, వర్షాలతో నీళ్లు నిలబడినప్పుడు వరి పంట దెబ్బతింటుందని, తట్టుకునే వరి వంగడాలను అందించాలన్నారు. కలుపు నివారణకు కూడా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఫంగస్, వైరస్‌ను తట్టుకొని, తడి నేలల్లో ఇబ్బందిలేని రకాలను సూచించాలన్నారు. పరిశోధనా సంచాలకుడు పీవీ.సత్యనారాయణ, విస్తర ణ సంచాలకుడు జి.శివన్నారాయణ, మార్టేరు సహ పరిశోధనా సంచాలకుడు టి.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జడ్డు వెంకటేశ్వరరావు కొత్త వరి వంగడాలు, కలుపు నివారణ మందులు వివరాలు, డీకంపోజ్ మందులు, నూతన వరి వంగడాల విస్తరణ, అంతర పంటల సాగు, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పీవీఎస్ గోపాల కృష్ణం రాజు, ఎం.రాంబాబు, సత్యనారాయణరాజు, పెమ్మరాజు తదితర అభ్యుదయ రైతులు వ్యవసాయ సాగులో ఇబ్బందులు, డ్రోన్ల వినియోగం తదితర అంశాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

అనంతరం పార్మా రోబోతో పురుగుమందుల పిచికారి, డ్రోన్లు వినియోగంతో మందుల పిచికారీని కలెక్టర్ నాగరాణి స్వయంగా పరిశీలించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సైంటిస్టులు డాక్టర్ గిరిజారాణి, డాక్టర్ రాజమణి, డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ మోహన్ రెడ్డి, డాక్టర్ రమణ డాక్టర్ మునిరత్నం, అభ్యుదయ రైతులు, మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం..!

- యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెన మరమ్మతు పనుల్లో జాప్యం
- రాకపోకలు నిలిపివేసినా ముందుకు సాగని పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు


పాలకోడేరు - గొల్లలకోడేరు యనమదుర్రు డ్రెయిన్ బ్రిడ్జిపై వేసిన ఇనుప ఊచల పైనుంచి రాకపోకలు

పాలకోడేరు, మే 1 (ఆంధ్రజ్యోతి): వంతెన మరమ్మతులకు గురైంది. ఎట్టకేలకు రాకపోకలు నిలిపివేసి మరమ్మతు పనులు చేపట్టారు. ఎప్పటిలాగే నిర్లక్ష్యం, అలసత్వం వాహనదారులకు శాపంగా మారింది. అసంపూర్తి పనులతో ఉన్న వంతెనపై ఇనప ఊచల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పాలకోడేరు - గొల్లలకోడేరు మధ్య యనమదుర్రుపై సుమారు 30 ఏళ్ల క్రితం వంతెన నిర్మించారు. భీమవరం నుంచి గొల్లలకోడేరు మీదుగా పాలకోడేరు, తణుకు, నవుడూరు తదితర గ్రామాలకు ఈ బ్రిడ్జే ప్రధాన మార్గం. గోతులు పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారడంతో ఆర్ అండ్ బి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఏప్రిల్ 10 నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకు రాకపోకలు నిలిపివేశారు. పనులు జాప్యం కావడంతో గతంలోనే ‘తవ్వేశారు.. వదిలేశారు.. శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’లో కథనం ప్రచురితమైంది. దీనితో మళ్లీ పనులు మొదలుపెట్టారు. ఏప్రిల్ నెలాఖరుకు రాకపోకలు పునరుద్ధరించాలి. ఈ దశలో ఐరన్ ఊచలు కట్టే పనులను రెండు రోజులుగా నిలిపివేశారు. శ్లాబ్ ఎప్పుడు వేస్తారు...? ప్రయాణాలకు ఎప్పుడు మార్గాన్ని సుగమం చేస్తారంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ తిరిగి రాలేక బ్రిడ్జిపై ఇనుప ఊచల మీద నుంచే ప్రయాణాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి.

సెల్‌ఫోన్లు దొంగిలించి..
యూపీఐతో నగదు కొట్టేశారు
ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

పాలకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లను దొంగిలించి యూపీఐ ద్వారా నగదు కొల్లగొడుతున్న సైబర్ ముఠా పాలకొండ పోలీసులకు పట్టుబడింది. ముగ్గురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 90,200 స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ఆకివీడుకు చెందిన యువకులు పట్టుబడ్డాడు. పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు గురువారం వివరాలు తెలిపారు. గత నెల 20న భామినికి చెందిన నారాయణరావు పాలకొండ పట్టణంలోని ఏటీఎం కేంద్రానికి వచ్చాడు. అక్కడ ఆయన సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు దొంగిలించారు. ఫోన్‌లోని యూపీఐ యాప్ ద్వారా రూ.92,700 నగదును మరో ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీనిపై నారాయణరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ అధికారులు నారాయణరావు ఖాతాను ఫ్రీజ్ చేసి లావాదేవీల ఆధారంగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడుకు చెందిన మేకల వెంకటేశ్, మహ్మద్ భాషా, గజపతినగరానికి చెందిన పసుపురెడ్డి గోపీచంద్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.90,200 రికవరీ చేసినట్టు డీఎస్పీ తెలిపారు. గతంలో వారు ఏటీఎం కార్డులను క్లోన్ చేసి మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు.

అదుపు తప్పిన ఆటో
ఎనిమిది మందికి గాయాలు

ఉంగుటూరు, మే 1(ఆంధ్రజ్యోతి): ఉండి-చేబ్రోలు ఆర్ అండ్ బి రహదారిలో ఉంగుటూరు మండలం సీతారాంపురం-గుణపర్రు పందికోడు మధ్య గురువారం ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఆకివీడుకు చెందిన పలువురు ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. తిరుగు ప్రయాణంలో సీతారాంపురం-గుణపర్రు పందికోడు మురుక్కోడు వంతెన సమీపంలో ఆటో రోడ్డు మార్జిన్ కుంగి పోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు.

రహదారి అధ్వానం

సీతారాంపురం-గుణపర్రు మురుక్కోడు వంతెన సమీపంలో ఆర్ అండ్ బి రహదారి గోతులతో ఉండడంతో అక్కడ ప్రయాణించే వారంతా పగటి పూట జాగ్రత్తలు తీసుకుంటారు. ఇక్కడ తరచు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి.

కత్తితో దాడి..
ముగ్గురి అరెస్టు

పెంటపాడు, మే 1(ఆంధ్రజ్యోతి): పాత గొడవల నేపథ్యంలో ఒక వ్యక్తిని చాకుతో పొడిచిన సంఘటన బుధవారం రాత్రి అలంపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పెనుమాక రాజుకు, అదే గ్రామానికి చెందిన పేకేటి సుమన్‌ల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అలంపురం రజక చెరువుదారిలో వెళుతున్న రాజుతో సుమన్, మరో ఇద్దరు ఘర్షణకు దిగారు. సుమన్ తన వద్ద ఉన్న చాకుతో రాజును పొడిచాడు. గాయపడ్డ రాజును స్థానికులు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ స్వామి తెలిపారు. నిందితుడు సుమన్‌తో పాటు ఇతనికి సహకరించిన బాదంపూడి జయప్రకాశ్, గనిసాల మణిరత్నంలను అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.